
- నేటి నుంచి కురుమూర్తి బ్రహోత్సవాలు
- విద్యుద్దీప కాంతుల్లో ఆలయం ముస్తాబు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తాదులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన పాలకవర్గం
- ఉమ్మడి జిల్లాలోనే తొలి, పెద్ద జాతర

# తిరుమలేశుడి సేవకు.. వేళాయే



కురుమూర్తి ఆలయ ఆవరణంలో కోనేరు


ఆలయ ముఖద్వార రాజగోపురం

మూసాపేట(చిన్నచింతకుంట) నవంబర్ 13 : పేదల తిరుపతి.. కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలుస్తున్న కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. స్వామి వారి జాతర, ఉద్దాలోత్సవం ఉంటేనే దేశంలో ఎక్కడ ఉన్నా స్వామి వారి ఉద్దాల ఉత్సవాలకు తప్పనిసరిగా వస్తారు. ఉద్దాలోత్సవానికి భక్తులు కుటుంబ సమేతంగా బండ్లు, వాహనాలపై లక్షల్లో తరలివస్తారు. కుటుంబ సమేతంగా స్వామి వారిని కొలిచి, రాత్రి మొత్తం అక్కడే ఉండి స్వామి సన్నిధిలో నిద్ర చేస్తారు. ఈ సంవత్సరం ఒక వైపు ఎన్నికలు, మరో వైపు జాతర ఉండడంతో భక్తుల సందర్శన అధికంగా ఉండనున్నది. ఉత్సవాలకు పాలక వర్గ సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన 14వ తేదీన స్వామి వారి కల్యాణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 18వ తేదీన స్వామి వారి అలంకరణోత్సవం, 19న స్వామి ఉద్దాల ఉత్సవం ఉంటుంది.

### ఆలయ స్థల పురాణం..

ఆకాశరాజు కుమార్తె పద్మావతిదేవిని ఆడంబరంగా వివాహం చేసుకునేందుకు వేంకటేశ్వరస్వామి కుబేరుడితో అప్పు తీసుకుంటాడు. తీసుకున్న అప్పును తీర్చడంలో స్వామి వారు ఇబ్బందులు ఎదుర్కొంటారు. చెప్పిన కాలం గడిచిపోతుండడంతో కుబేరుడు అప్పు తీర్చాలని ఒత్తిడి చేయడంతో కలత చెందిన స్వామివారు ఓ రోజు అర్ధరాత్రి తిరుమలను వదిలి ఉత్తర దిశగా పయనమై నడుచుకుంటూ వస్తారు. జూరాల వద్ద గుండాల జలపాతం వద్ద నిండుగా ప్రవహిస్తున్న నదిని చూసి పరవశించిన స్వామివారు స్నానమాచరిస్తారు. అప్పటి వరకు తెల్లగా ప్రవహిస్తున్న నదిలో నీరు స్వామి వారి స్పర్శతో నీలం రంగులోకి మారుపోతుంది. ఆ రంగును చూసిన స్వామి వారు కృష్ణా అంటూ నదిని సంభోదిస్తారు. ఆయన పిలుపుతో కృష్ణమ్మ ప్రత్యక్షమై కాలినడకతో వస్తున్న స్వామివారు పాదాలు కందిపోకుండా పాదుకలను బహూకరిస్తుంది. అందుకే కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం ఉద్దాల ఉత్సవంగా నిర్వహిస్తారు. అక్కడి నుంచి బయలుదేరిన స్వామి వారు నిర్మానుష్యంగా, నిర్మలమైన ప్రశాంతంగా ఉన్న కురుమూర్తి కొండల్లో ఉన్న కాంచన గుహలో సేదతీరేందుకు నిలిచిపోతాడు. స్వామి వారు లేరన్న బెంగతో పద్మావతి దేవి జాడ వెతుక్కుంటూ కురుమూర్తి కొండలకు చేరుకుంటుంది. స్వామి వారిని తన వెంట తిరుమలకు రావాలని ప్రాదేయపడడంతో కాదనలేక, తనకు ఇష్టమైన కురుమూర్తి కొండలను వదిలి వెళ్లలేక తన ప్రతిరూపంతోపాటు, పద్మావతిదేవి ప్రతి రూపాలను ఆ కాంచన గుహలోనే వదిలి వెళ్తారు. అప్పటి నుంచి అక్కడికి వచ్చే భక్తులకు స్వామివారు దర్శనమిస్తూ వారి కోరికలను తీర్చడం ద్వారా భక్తులు ఇష్టంగా ఇచ్చే కానుకలతో కుబేరుడి అప్పు తీరుస్తున్నట్లు భక్తుల నమ్మకం.


కురుమూర్తి స్వామి వారి పాదుకలు (ఉద్దాలు)

### ఉమ్మడి జిల్లా నుంచి బస్సు సౌకర్యం..

కురుమూర్తి స్వామి బ్రహోత్సవాలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు జిల్లా నలుమూల నుంచి కురుమూర్తి స్వామి సన్నిధికి బస్సు సౌకర్యం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, దేవరకద్ర, వనపర్తి, మరికల్, మక్తల్‌తోపాటు హైదరాబాద్ నుంచి కురుమూర్తి జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు, భక్తులు స్వామి వారికి సమర్పించే మొక్కుబడులు చెల్లించడం కోసం ప్రత్యేక హుండీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు వస్తు రూపంలో ఇచ్చే కానుకలకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఆలయం పరిసరాల్లో మత్తు పదార్థాలు అమ్మడం, జూదం ఆడడం నిషేధించినట్లు తెలిపారు.

### ప్రధాన ఘట్టం ఉద్దాల ఊరేగింపు..

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఉద్దాల ఊరేగింపు ఉత్సవమే ప్రధాన ఘట్టం. ఉద్దాల ఊరేగింపులో భాగంగా మొదట పల్లమర్రి నుంచి చాటను ఊరేగింపుగా వడ్డేమాన్ వరకు తీసుకొస్తారు. అక్కడే నియమ నిష్టలతో తయారు చేసిన స్వామి వారి పాదుకలు(ఉద్దాల)ను ఊరేగింపు ఉంటుంది. అందుకు భారీ బందోబస్తు ఆలయం వరకు కొనసాగుతుంది. ఉద్దాల ఉత్సవానికి ప్రజాప్రతినిధులతోపాటు లక్షల్లో భక్తులు తరలివస్తారు. కాగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్, ఉన్నతాధికారులతో స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే సూచన మేరకు అధికారులు, పాలకవర్గం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

### నేటినుంచి ఉత్సవాలు ప్రారంభం..

- కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేదీ ఉదయం 8గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అవాహితదేవాతా పూజలు, ధ్వజారోహణం, దేవతాహ్వానం, భైరీపూజ, ఉత్సవాంగ 108 అష్టోత్తర శతకలశాభిషేకం, స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం స్వామి వారికి మయూర వాహన సేవ కార్యక్రమాలు ఉంటాయి.
- 15న ప్రత్యేక పూజలతోపాటు హంసవాహన సేవ కార్యక్రమాలు ఉంటాయి.
- 16న ఉదయం 8గంటల నుంచే పూజా కార్యక్రమాలతోపాటు శేషవాహన సేవ.
- 17న ప్రత్యేక పూజలు, గజ వాహన సేవ కార్ర్యమాలు.
- 18న స్వామి వారికి స్వర్ణభరణములతో అలంకార ఉత్సవం, రాత్రికి అశ్వవాహన సేవ కార్ర్యమాలు ఉంటాయి.
- ఉత్సవాల్లో అసలైన ఘట్టం 19వ తేదీన ఉద్దాల ఉత్సవము, హనుమద్వాహన సేవ, గరరుడ వాహన సేవ కార్యక్రమాలు ఉంటాయి.
- 20న ఉదయం 8గంటల ఆవాహిత దేవతాపూజలు, హోమాదులు, శ్రీపుష్పయాగము, శాత్తుముర్రై తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయి.
- 21న ఉదయం 9గంటలకు అవబృదము శాత్తుముర్రై, మంగళ నీరాజనముతో ప్రత్యేక పూజలు.
- 29న ఉదయం 9:45గంటలకు స్వామి వారి అలంకారము తీయబడుతుందని పాలకవర్గం సభ్యులు తెలిపారు.

- మాటలే తప్ప పనులు చేతకావు
- ఢిల్లీ పెద్దలకు తెలంగాణను తాకట్టు పెట్టేందుకు కుట్ర
- కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమైతం
- బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- మైనార్టీ సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి
- హోం శాఖ మంత్రి మహమూద్ అలీ
- కోస్గిలో మైనార్టీలతో ఆత్మీయ సమ్మేళనం

# రేవంత్‌రెడ్డి అవకాశవాది

కోస్గి, నవంబర్ 13 : రేవంత్‌రెడ్డి అవకాశవాది అని, ప్రజల జీవితాలను ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెట్టేందుకు కుట్ర చేస్తున్నారని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం కోస్గి మున్సిపాలిటీలోని లక్ష్మీ నర్సింహా రెడ్డి గార్డెన్‌లో మైనార్టీల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. సమ్మేళనానికి గనుల, భూగర్భ వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి హోంమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం మీ వెంటే ఉంటూ మీ బాగుకోసం ఆలోచించి సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని ప్రజలను కోరారు. గతంలో ఏ పార్టీ కూడా మైనార్టీల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ వచ్చిన నాటి నుంచి మైనార్టీలకు పెద్దపీట వేసి అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకొని చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డివి ఉట్టి మాటలే తప్పా చేసేది శూన్యమన్నారు. అబద్ధపు మాటలు.. మోసాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, నమ్మి మోసపోతే గోసపడుతామన్నారు. పార్టీలు మారుతూ ప్రజల జీవితాలను తాకట్టు పెట్టే వారిని నమ్మొద్దని కోరారు. మతాలు, కులాల పేరుతో చిచ్చుపెట్టే ప్రయత్నం కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్నాయని, ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్న తెలంగాణ ఇలాగే ఉండాలంటే మరోసారి బీఆర్‌ఎస్ సర్కారే రావాలన్నారు. మసీదుల్లో ఉండే మౌజామ్, ఇమాంలకు ప్రతి నెలా రూ.5వేల గౌరవ వేతనాన్ని అందిస్తున్నదని, ఇప్పటి వరకు రూ.304కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో రూ.10వేలకు పెంచే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్ని సార్లు ధర్నా చేసినా మౌజామ్, ఇమాంలను విస్మరించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో మైనారిటీ పాఠశాలలను ఏర్పాటు చేసి లక్షా 40వేల మంది విద్యార్థులకు రూ.3,300 కోట్లు ఖర్చు చేసిందన్నారు. నేడు కార్పొరేట్ తరహాలో విద్య అందిస్తున్నట్లు వెల్లడించారు. 2,520మంది విద్యార్థులు మెడిసిన్, ఇంజినీర్ వంటి ఉన్నత చదువులను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టుకొని తెలంగాణకు బంగారు బాటలు వేసుకుందామని తెలిపారు.

### సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి..

మైనార్టీల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, మరింత అభివృద్ధి కావాలంటే సీఎం కేసీఆర్ మరోసారి సీఎం కావాలని గనులు, భూగర్భజల వనరుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ పార్టీ కూడా మైనార్టీల సంక్షేమాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని, ఆ పార్టీకే రాష్ట్రంలో గ్యారెంటీ లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ వారు అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఎందుకు ఇక్కడిచ్చే హామీలను అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.13కోట్లతో మసీదుల పునరుద్ధరణ, ఈద్గాల నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.150కోట్లు మైనారిటీ రుణాలు మంజూరు చేశామన్నారు. కోస్గిలో 5ఎకరాల్లో వైకుంఠధామం స్థలం, రూ.10లక్షలతో ప్రహరీ, ఈద్గాకు రూ.15లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. మైనార్టీ గురుకుల భవన నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేశామన్నారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ సలీం, ఎన్నికల ఇన్‌చార్జి లింగంపల్లి కృష్ణారావు, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శ్యాసం రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషరాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


కోస్గిలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి, చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి